సాక్షి
నిజామాబాద్
మంగళవారం । 8 । ఏప్రిల్ । 2025



పచ్చిధాన్యం కొనుగోళ్లకు..

పచ్చి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ఆసక్తి చూపుతున్నారు. తమ ఏజెంట్ల ద్వారా ప్రచారం చేయిస్తున్నారు.

- 8లో ▸



ఫిర్యాదులను సత్వరమే..

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ హనుమంతు సూచించారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
40.1 /20.2

వాతావరణం

ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. క్రమంగా ఎండ తీవ్రత పెరుగుతుంది. వాతావరణం పొడిగా మారుతుంది. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నూతన కార్యవర్గం ఎన్నిక



సుభాష్‌నగర్: తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ యూనియన్ (బీఎంఎస్) జిల్లా నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. నగరంలోని విద్యుత్ భవన్‌లో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం శశికుమార్ నూతన కమిటీని ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా బదావత్ సంతోష్‌నాయక్, ప్రధాన కార్యదర్శిగా టీ మహేందర్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎండీ మొయినుద్దీన్‌తో పాటు 20 మంది విద్యుత్ కార్మికులతో నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. సమావేశంలో ఎన్‌పీడీసీఎల్ కంపెనీ ప్రెసిడెంట్ రమణారెడ్డి, కామారెడ్డి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అశోక్, బాలరాజు, విద్యుత్ కార్మికులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో అంబలి కేంద్రం



నిజామాబాద్‌అర్బన్: తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం (టీఎన్జీవో) జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన అంబలి పంపిణీ కేంద్రాన్ని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సోమవారం ప్రారంభించారు. తాగునీటితోపాటు ఉచితంగా అంబలి పంపిణీకి చొరవచూపడం అభినందనీయమని టీఎన్జీవో ప్రతినిధులను కలెక్టర్ అభినందించారు. ఉద్యోగులతోపాటు వివిధ పనుల కోసం కలెక్టరేట్‌కు వచ్చే వారికి అంబలి కేంద్రం ఎంతో ఉపశమనాన్ని అందిస్తుందని అన్నారు. కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు సుమన్, కార్యదర్శి శేఖర్, రాష్ట్ర నాయకుడు గైని గంగారాం తదితరులు పాల్గొన్నారు.

నగరంలో బాలిక కిడ్నాప్



చిన్నారి రమ్య

ఖలీల్‌వాడి: నగరంలోని గాంధీచౌక్ ప్రాంతం నుంచి మూడేళ్ల బాలిక కిడ్నాప్ అయినట్లు ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి సోమవారం తెలిపారు. వివరాలు ఇలా.. నగరంలోని నాగారం కెనాల్ కట్టకు చెందిన కొండవ్వ తన కుతూరు, మనవడు, మనవరాలు రమ్యతో కలిసి గాంధీచౌక్ ప్రాంతంలో భిక్షాటన చేస్తూ జీవించేది. గాంధీచౌక్ ప్రాంతంలో ఆదివారం రాత్రి కొండవ్వ తన మనవరాలు రమ్య(3)తో కలిసి నిద్రపోయింది. కొద్దిసేపటి తర్వాత నిద్రనుంచి మేల్కొనగా రమ్య కనిపించకపోవడంతో చుట్టుపక్కల ఎంతవెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసింది. విచారణ చేపట్టిన పోలీసులు గాంధీచౌక్ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజీని పరిశీలించి మహారాష్ట్ర ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి కిడ్నాప్ చేసినట్లు గుర్తించారు. రెండు పోలీసు బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గత నెల 27వ తేదీన నగరంలో ఓ బాలుడిని కిడ్నాప్ చేసిన తల్లీకొడుకులు రాయితోమోది హత్య చేసిన ఘటనను మరువకముందే మరో బాలిక కిడ్నాప్‌కు గురైంది.

వివాదాల వీడీసీలు

అభివృద్ధిని మరిచి ఆగడాలు

- జిల్లాలో మితిమీరుతున్న వైనం
- మాట వినకుంటే బహిష్కరణే
- లక్షల్లో జరిమానాలు.. బహిష్కరణలు
- రాజకీయ ఒత్తిళ్లతో ఏమీ చేయలేకపోతున్న అధికారులు



ఖలీల్‌వాడి: పల్లెల అభివృద్ధికి పాటుపడాల్సిన గ్రామాభివృద్ధి కమిటీ(వీడీసీ)లు వ్యక్తిగతంగా, కుల సంఘాల పరంగా కక్షసాధింపులకు పాల్పడుతున్నాయి. కమిటీల్లో మెంబర్లుగా చలామణి అవుతున్నవారు తమ కన్నింగ్ ఆలోచనలను గ్రామస్తుల అందరి అభిప్రాయంగా పేర్కొంటూ అమలు చేస్తున్నారు. తమ మాట వినని వారిని వెంటాడుతున్నారు. ఇళ్లను కూల్చడం, భూములను లాక్కోవడం, లక్షల్లో జరిమానాలు, బహిష్కరణలు.. ఇలా తమ ఆగడాలను వీడీసీలు కొనసాగిస్తున్నాయి. ఎలాంటి గుర్తింపులేని కమిటీలు గ్రామాల్లో సమాంతర ప్రభుత్వాన్ని నడుపుతున్నాయి. జిల్లాలోని ఆర్మూర్, బాల్కొండ, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాల్లో గ్రామాభివృద్ధి కమిటీల ఆగడాలు రోజురోజుకూ ఎక్కువవుతున్నాయి.

కోడిగుడ్డు నుంచి బెల్ట్‌షాపు వరకు

గ్రామాల్లో కోడి గుడ్డు నుంచి బెల్ట్‌షాపులో మద్యం వరకు ఏది విక్రయించాలన్నా వీడీసీలు టెండర్లు నిర్వహిస్తున్నాయి. కోడిగుడ్లు, మద్యం, కూల్‌డ్రింక్స్ విక్రయాలను వేలంపాట ద్వారా అప్పగిస్తున్నాయి. వేలంపాటలో పాడిన మొత్తాన్ని వీడీసీకి చెల్లించి దుకాణాలను నిర్వహించుకోవాల్సి ఉంటుంది. దీంతో ఎక్కువ ధరలకు ఆయా వస్తువులను విక్రయించినా పట్టించుకునే వారు లేరు. నిబంధనలను ఎవరైనా ఉల్లంఘిస్తే జరిమానాలు విధిస్తారు.

ప్రజా ప్రతినిధులూ వీడీసీకి దాసోహమే..!

తమను వ్యతిరేకించిన ప్రజాప్రతినిధులనూ వీడీసీలు బహిష్కరించిన ఘటనలున్నాయి. ఆర్మూర్ మండలం పెర్కిట్ వీడీసీ అప్పటి ఆర్మూర్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను బహిష్కరించింది. వీడీసీలు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ బాధితులు పోలీస్ స్టేషన్‌లకు వెళ్లొద్దు, న్యాయ స్థానాలను ఆశ్రయించొద్దు. దీంతో స్థానిక ప్రజాప్రతినిధులు వీడీసీలకు దూరంగా ఉంటూనే తమ పనులను చక్కబెట్టుకుంటున్నారు. కొన్ని గ్రామాల్లో ఇళ్ల నిర్మాణానికి సైతం వీడీసీల అనుమతి తీసుకోవాల్సిన పరిస్థితి ఉంది. గ్రామ పంచాయతీల కార్యదర్శులు సైతం ఇళ్ల నిర్మాణదారులను వీడీసీల వద్దకు వెళ్లాలని సూచిస్తుండడం గమనార్హం.

1970లో ఏర్పాటైన కమిటీలు

ప్రజల భాగస్వామ్యంతో పల్లెల అభివృద్ధికి కృషి చేయాలనే ఉద్దేశంతో 1970లో గ్రామాభివృద్ధి కమిటీలు ఏర్పడ్డాయి. క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి వాటిపై చర్చించి పరిష్కార మార్గాలు చూపాలనే ఉద్దేశంతో గ్రామంలోని అన్ని వర్గాల నుంచి ఒక్కో సభ్యుడితో కమిటీలు ఏర్పాటు చేస్తూ వస్తున్నారు. వీడీసీలు ప్రధానంగా నీరు, మురికి కాలువలు, వీధి దీపాలు తదితర పనులపై దృష్టి సారించాలి. ప్రారంభంలో వీడీసీల ఆధ్వర్యంలో గ్రామాల్లో ప్రతి ఇంటి నుంచి కొంత డబ్బును సేకరించి వాటితో గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించేవారు.

ఏర్గట్ల పోలీస్‌స్టేషన్ ముట్టడి

- వీడీసీ సభ్యులపై కేసు నమోదు.. తాళ్లరాంపూర్ గ్రామస్తుల ఆగ్రహం

మోర్తాడ్(బాల్కొండ): గ్రామంలోని తాటి చెట్లను గీయించాలని లేని పక్షంలో వాటిని తమకు స్వాధీనం చేయాలని మండలంలోని తాళ్లరాంపూర్ గ్రామాభివృద్ధి కమిటీ పట్టుబట్టింది. దీన్ని గౌడకులస్తులు వ్యతిరేకించడంతో వివాదం ఏర్పడింది. శ్రీరామ నవమి సందర్భంగా కుంకుమ పూజలో పాల్గొనేందుకు గుడికి వెళ్లిన తమను వెళ్లగొట్టారని గౌడ కులానికి చెందిన మహిళలు వీడీసీతోపాటు పూజారిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనలో పూజారితోపాటు ముగ్గురు వీడీసీ సభ్యులపై కేసు నమోదైంది. దీన్ని వ్యతిరేకిస్తూ గౌడ కులస్తులను మినహాయించి మిగతా గ్రామస్తులు ఇంటికి ఇద్దరి చొప్పున తరలివెళ్లి ఏర్గట్ల పోలీస్ స్టేషన్‌ను సోమవారం ముట్టడించారు. దీంతో ఉద్రిక్తత నెలకొంది. భీమ్‌గల్ సీఐ సత్యనారాయణ, ఏర్గట్ల ఎస్సై రాము తాళ్లరాంపూర్ గ్రామస్తులతో చర్చలను జరిపారు. వీడీసీ సభ్యులతోపాటు పూజారిని ఎట్టి పరిస్థితుల్లో అరెస్టు చేయొద్దని గ్రామస్తులు పట్టుబట్టారు. రెండు వర్గాల వాదనలను విన్న పోలీసులు గ్రామంలోనే శాంతియుత వాతావరణంలో చర్చలను జరిపిస్తామని, అప్పటి వరకూ ఒకరి జోలికి ఒకరు వెళ్లి వివాదం పెద్దది చేయొద్దని సూచించారు. దీంతో తాళ్లరాంపూర్ గ్రామస్తులు వెనుదిరిగారు.



ఏర్గట్ల పోలీసు స్టేషన్‌ను ముట్టడించిన తాళ్లరాంపూర్ గ్రామస్తులు

జక్రాన్‌పల్లి వీడీసీ తీరే వేరు

జక్రాన్‌పల్లి వీడీసీ వివాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తోంది. మహిళ ఇంటి నిర్మాణాన్ని అడ్డుకోవడంతో ఆమె పోలీసులను ఆశ్రయించగా, అట్రాసిటీ కేసు నమోదైంది. అలాగే గ్రామంలోని రజకులకు చెందిన భూమిలో అంగడి (సంత) ఏర్పాటు చేయాలని వీడీసీ నిర్ణయించడంతో రజకులు అభ్యంతరం తెలిపారు. దీంతో రజకులను వీడీసీ బహిష్కరించగా వారు కోర్టును ఆశ్రయించారు. కోర్టు వీడీసీపై కేసులు నమోదు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ వివాదం కొనసాగుతూనే ఉంది.

ఇంటిని కూల్చేశారు

30 ఏళ్ల క్రితం నిర్మించిన ఇంటిని అక్రమమంటూ వేల్పూర్ మండలం వెంకటాపూర్ వీడీసీ సభ్యులు కూల్చివేశారు. ఏళ్లు ఇంటికి ట్యాక్స్ కడుతూ వస్తున్నానని, అన్ని లీగల్‌గానే ఉన్నాయని బాధితుడు మొత్తుకున్నా వీడీసీ వినలేదు. చివరకు ఇంటిని కూల్చివేయడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా వీడీసీపై కేసు నమోదైంది.

తాటి చెట్ల వివాదం ఆలయానికి చేరింది

ఏర్గట్ల మండలం తాళ్లరాంపూర్‌లో గౌడ కులస్తులు, వీడీసీ మధ్య తాటిచెట్ల విషయంలో నెలకొన్న వివాదం ఆలయానికి చేరింది. గౌడ కులానికి చెందిన మహిళలు శ్రీరామ నవమి సందర్భంగా కుంకుమార్చన చేసేందుకు ఆలయానికి వెళ్లారు. అయితే అప్పటికే గౌడకులస్తులపై వీడీసీ కఠినంగా ఉండడంతో పూజకు వచ్చిన మహిళలకు ఆలయ పూజారి అభ్యంతరం తెలిపారు. అవమానానికి గురైన సదరు మహిళలు పూజారితోపాటు వీడీసీలోని కీలక వ్యక్తులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ వివాదం పోలీస్ స్టేషన్ ముట్టడికి దారి తీసింది.

మేం చెప్పిందే చట్టం అంటున్నారు

- మల్లాపూర్ వీడీసీపై ప్రజావాణిలో ఫిర్యాదు

డిచ్‌పల్లి: తాము చెప్పిందే చట్టమని దౌర్జన్యం చేస్తూ తన సొంత భూమిలోకి రానివ్వడం లేదని మండలంలోని మల్లాపూర్ వీడీసీపై రాంపూర్ గ్రామానికి మహ్మద్ షేర్‌ఖాన్ సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ హనుమంతుకు ఫిర్యాదు చేశారు. తన తండ్రి మహమ్మద్ మీర్‌సాబ్ 1988లో మల్లాపూర్‌కు చెందిన గోద ఒడ్డెన్న వద్ద సర్వే నంబర్ 262/అ లో 3.2750 ఎకరాలు, సర్వే నెంబర్ 263లో 2.20 ఎకరాల భూమిని కొనుగోలు చేశాడని, తన తండ్రి మరణం తరువాత ఆ భూమిలో తాను పంటలు సాగు చేస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. గత కొద్ది రోజులుగా మల్లాపూర్ వీడీసీ సభ్యులు పది మంది తన భూమిలోకి దౌర్జన్యంగా ప్రవేశించారని, భూమి తమ గ్రామానికి చెందిన వారిదని, ఇటువైపు రావొద్దని బెదిరిస్తున్నాడని తెలిపాడు. ఈ భూమిని తన తండ్రి కొనుగోలు చేశాడని, మీ వద్ద రిజిస్ట్రేషన్ పత్రాలు ఉంటే చూయించాలని వీడీసీ సభ్యులను తాను అడిగితే.. తాము ఏది చెబితే అదే చట్టమని బెదిరిస్తున్నారని వీడీసీపై ఫిర్యాదు చేశాడు.

మాతా శిశు మరణాలు తగ్గించాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

నిజామాబాద్‌నాగారం: మాతా శిశు మరణాలను తగ్గించాలని, గర్భిణులు, బాలింతలకు అందించే సేవలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రజారోగ్యం కుటుంబ సంక్షేమంపై ముద్రించిన కరదీపికలను కలెక్టర్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రిస్క్‌లో ఉన్న గర్భిణులను ముందే గుర్తించి బర్త్ ప్లానింగ్ నిర్వహించడంతో మాతా శిశు మరణాలను తగ్గించొచ్చన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అంకిత్, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, డీఆర్డీవో సాయాగౌడ్, ఆర్డీవో రాజేంద్రకుమార్, మెప్మా పీడీ రాజేందర్, డీపీవో శ్రీనివాస్, ఏసీపీ రాజావెంకటరెడ్డి, మున్సిపల్ కమిషనర్ దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సేవలను ఉపయోగించుకోవాలి

ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో అందించే ఉచిత సేవలను మహిళలు ఉపయోగించుకోవాలని డీఎంహెచ్‌వో రాజశ్రీ సూచించారు. నగరంలోని మాలపల్లి ఆరోగ్య కేంద్రంలో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. మహిళలు రక్తహీనతను అధిగమించాలని, గర్భధారణ సమయంలో ప్రభుత్వ వైద్యులతో కనీసం ఆరు సార్లు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యురాలు సహిస్తా పర్వీన్, డీపీహెచ్‌ఎన్‌వో స్వామి సులోచన, డీహెచ్‌ఈ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీ

- నియామకాలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్
- తెయూలో 42 ఖాళీలు
- నిరుద్యోగుల్లో ఆశలు
- కాంట్రాక్ట్ అధ్యాపకుల్లో ఆందోళన
- ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ల నియామకమెన్నడో?



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ విశ్వవిద్యాలయానికి త్వరలోనే అసిస్టెంట్ ప్రొఫెసర్లు రానున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 12 ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఖాళీల భర్తీకి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. 12 ఏళ్లుగా యూనివర్సిటీల్లో నెలకొన్న సమస్య ఈ నిర్ణయంతో పరిష్కారం కానుంది. నియామకాలకు సంబంధించిన మార్గదర్శకాలను విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి యోగితారాణా ఆదివారం విడుదల చేశారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన కామన్ రిక్రూట్‌మెంట్ గైడ్‌లైన్స్‌ను ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేసింది. ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి నేతృత్వంలోని కమిటీ సిఫార్సు చేసిన మార్గదర్శకాలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ప్రభుత్వ నిర్ణయంతో గత కొన్నేళ్లుగా ఎదురు చూస్తున్న నిరుద్యోగుల్లో ఆశలు చిగురించాయి. మరోవైపు కాంట్రాక్ట్ ప్రాతిపదికన యూనివర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లు (అకడమిక్ కన్సల్టెంట్లు)గా విధులు నిర్వర్తిస్తున్న అధ్యాపకులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం జారీచేసిన మార్గదర్శకాల్లో కాంట్రాక్టు అధ్యాపకుల ఊసే లేకపోవడంతో రెగ్యులరైజ్ కోసం పోరాడుతున్న వారికి ఎదురుదెబ్బ తగిలినట్లయిందని చెప్పొచ్చు. దీంతో ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళనలకు సిద్ధమవుతున్నారు. ఇందుకు సంబంధించిన కార్యాచరణ కోసం సోమవారం ఓయూలో సమావేశం నిర్వహించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా ప్రభుత్వం కేవలం అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకాలకు మాత్రమే మార్గదర్శకాలు జారీచేయడం, అసోసియేట్, ప్రొఫెసర్ పోస్టుల భర్తీ ఊసే లేకపోవడంతో నిరుద్యోగులు, విద్యార్థి సంఘాల నాయకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

తెయూలో ఖాళీలు ఇలా..

హోదా	మంజూరైన పోస్టులు	పని చేస్తున్నవారు	ఖాళీలు
అసిస్టెంట్ ప్రొఫెసర్	89	47	42
అసోసియేట్ ప్రొఫెసర్	43	10	33
ప్రొఫెసర్	20	03	17

పాలకమండళ్ల ఆమోదం తర్వాతే..



ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలను పాలకమండళ్ల సమావేశంలో ఆమోదించాల్సి ఉంటుంది. ఆ తర్వాతే ప్రభుత్వం నియామకాల నోటిఫికేషన్ జారీ చేస్తుంది. అనంతరం రిజర్వేషన్, రోస్టర్ విధానాలు తయారు చేస్తారు. రెండు, మూడు నెలల్లో నోటిఫికేషన్ జారీ చేసే అవకాశం ఉంది.

– టీ యాదగిరిరావు, వీసీ, తెయూ

చేజారిన కొనుగోలు కేంద్రాలు!

- జీర్ణించుకోలేకపోతున్న సొసైటీలు
- సగం కేంద్రాలు ఎస్‌హెచ్‌జీలకు
- మహిళల చేతికి ఇవ్వడంపై వ్యక్తమవుతున్న అసంతృప్తి
- ఐకేపీ సెంటర్లు పెట్టకుండా మోకాలడ్డే ప్రయత్నం!
- అధికారులకు అందిన ఫిర్యాదులు

డొంకేశ్వర్(ఆర్మూర్): మహిళా సంఘాల చేతికి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఇవ్వడంతో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో అసంతృప్తి కనిపిస్తోంది. కొన్నేళ్లుగా కొనుగోలు కేంద్రాలను నిర్వహిస్తూ వస్తున్న తమను కాదని ఐకేపీ మహిళలకు కేటాయించడాన్ని సొసైటీలు జీర్ణించుకోలేకపోతున్నాయి. ధాన్యం కొనుగోళ్ల ద్వారా సమకూరుతున్న ఆదాయంతోనే సొసైటీలు మనుగడ సాగిస్తుండగా, ప్రస్తుతం సెంటర్లు తగ్గిపోవడంతో ఆదాయం తగ్గిపోతోందని పాలకవర్గాల్లో ఆందోళన నెలకొంది. అయితే ఆదాయ మార్గాలు మూసుకుపోవడంతో ఏం చేయాలో తెలియక గ్రామాల్లో ఐకేపీ సెంటర్లు పెట్టకుండా రైతులతో మోకాలడ్డే ప్రయత్నాలు చేస్తున్నాట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. సెంటర్లు నిర్వహించకుండా మహిళలను, ఐకేపీ ఉద్యోగులకు ఇబ్బందులు పెడుతున్నారు. రెండు రోజుల క్రితం నిజామాబాద్ రూరల్, ఆర్మూర్, బోధన్ నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు పెట్టకూడదని ఐకేపీ సిబ్బందిని ఇబ్బందులకు గురి చేసినట్లు డీసీవో, డీఆర్‌డీవోకు ఫిర్యాదులు వచ్చాయి. దీంతో జిల్లాలో కొన్ని చోట్ల ఐకేపీ సెంటర్లు పెట్టడానికి మహిళలు వెనకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లా వ్యాప్తంగా 331 ఐకేపీ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించగా ఇప్పటి వరకు 150 వరకు కేంద్రాలను తెరిచారు. మహిళలను ప్రోత్సహించేందుకు కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్, డీఆర్‌డీవో, ఐకేపీ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా సెంటర్లను ప్రారంభించాలని, అడ్డుకోవాలని చూసిన వారిపై చర్యలు తీసుకుంటామని మహిళలకు ధీమా ఇస్తున్నారు.

మొదటిసారి కావడంతో..

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం తొలిసారిగా యాసంగి ధాన్యం కొనుగోలు బాధ్యతలను అప్పగించింది. జిల్లాలో ఏర్పాటు చేసే సెంటర్లలో సగం వరకు ఎస్‌హెచ్‌జీలకే ఉన్నాయి. గతంలో ఐకేపీకి 67 సెంటర్లు మాత్రమే ఉండగా ఇప్పుడు ఆ సంఖ్యను 331కు పెంచారు. ఇదివరకు కేంద్రాలను నిర్వహించిన మహిళల సంఘాలకు ఇబ్బందులు లేకపోగ, కొత్తగా ఏర్పాటు చేసే దగ్గరే సమస్యలు ఎదురవుతున్నాయి. వడ్లు కొనుగోలు చేయడానికి అవసరమయ్యే కాంటాలు, తేమ శాతం కొలిచే మిషిన్లు, ట్యాబ్‌లు, ఇతర పరికాలు అందుబాటులో లేవు. అనుభవం కూడా లేకపోవడంతో సెంటర్ల ఏర్పాటుకు మహిళలు వెనుకాముందు అవుతున్నారు. ఈ కారణంగా కేంద్రాల ఏర్పాటు ఆలస్యం కావడంతో రైతులు ఐకేపీ సెంటర్లు వద్దని, సొసైటీలే కావాలని కోరుతున్నారు. అయితే ఇబ్బందులను అధిగమించి సెంటర్లను ప్రారంభించాలని ఐకేపీ అధికారులు పట్టుదలతో ఉన్నారు. రానున్న రోజుల్లో కూడా సొసైటీలను పక్కన పెట్టి పూర్తిగా కొనుగోలు కేంద్రాలను మహిళా సంఘాలకే ఇస్తారని ప్రచారం జరుగుతోంది.

సొసైటీలు సహకరించాలి

మహిళా సంఘాలు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఉద్దేశంతో ప్రభుత్వం ఎస్‌హెచ్‌జీలకు ధాన్యం కొనుగోళ్ల బాధ్యతలు అప్పగించింది. ప్రభుత్వ ఆదేశాలను పాటించి అమలు చేయాల్సిన బాధ్యత మాపై ఉంది. ఐకేపీ సెంటర్లు ఏర్పాటు చేసే మహిళలకు ఇబ్బందులు కలుగకుండా సొసైటీల సహకరించాలి. ఒకటి, రెండు చోట్ల సమస్యలు ఏర్పడిన విషయం వాస్తవమే. వాటిని మా రెండు శాఖలు కలిసి కో ఆర్డినేషన్‌తో పరిష్కరించుకుని ముందుకు వెళతాం.

– శ్రీనివాస్ రావు, డీసీవో
– సాయాగౌడ్, డీఆర్డీవో

చెత్త వాహనాల అడ్డగింత



కమిషనర్ దిలీప్‌కుమార్‌కు తమ సమస్యలను వివరిస్తున్న స్థానికులు

డంపింగ్‌యార్డు వద్ద స్థానికుల ఆందోళన

నిజామాబాద్ సిటీ: డంపింగ్ యార్డుకు చెత్తను తరలిస్తున్న మున్సిపల్ కార్పొరేషన్ వాహనాలను నగర శివారులోని నాగారం వద్ద స్థానికులు అడ్డుకున్నారు. 300, 80 క్వార్టర్స్ వాసులు వాహనాలకు అడ్డుగా నిలిచి ఆందోళన చేశారు. డంపింగ్‌యార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రభుదాస్ స్థానికులను సముదాయించినా వినలేదు. చివరికి మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్ వచ్చి స్థానికులతో మాట్లాడారు. డంపింగ్ యార్డులో తరచూ నిప్పంటుకోవడంతో పొగ ఇళ్లలోకి వ్యాపిస్తోందని స్థానికులు తెలిపారు. కళ్ల మంటతోపాటు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని తెలుపగా, డంపింగ్ యార్డు నుంచి పొగ రాకుండా చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు. దీంతో ఆందోళనకారులు శాంతించారు. కమిషనర్ వెంట శానిటరీ సూపర్‌వైజర్ సాజిద్ అలీ, ఏఎంసీ జయకుమార్ ఉన్నారు.

క్లుప్తంగా

నేటినుంచి బీఎస్ఎన్ఎల్ ప్రత్యేక సేవా శిబిరాలు

బోధన్: డివిజన్ పరిధిలో బీఎస్ఎన్ఎల్(భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్) వినియోగదారులకు మెరుగైన సేవలందించేందుకు ప్రత్యేక సేవా శిబిరాలు నిర్వహించనున్నట్లు సంస్థ నిజామాబాద్ డీఈ రాంకుమార్, సబ్ డివిజనల్ ఇంజినీర్ వేణుగోపాల్ చారి, జేటీవో ఉదయ్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. మంగళవారం బోధన్‌లో, 11న కోటగిరి, 19న రుద్రూర్‌లో, 25న రెండో దఫా బోధన్‌లో శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ శిబిరాల్లో నెట్‌వర్క్ సమస్యలు, ఇంటర్నెట్ సేవల లోపాలు, సిమ్ మార్పులు, బిల్లింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రెమ్యునరేషన్ సక్రమంగా చెల్లించండి

నిజామాబాద్‌అర్బన్: పదో తరగతి మూల్యాంకనంలో టీచర్లకు రెమ్యురేషన్ సక్రమంగా చెల్లించాలని పీఆర్‌టీయూ తెలంగాణ జిల్లా ప్రధాన కార్యదర్శులు కనకపురం రవీందర్, లక్ష్మీరాజంలు సోమవారం డీఈవో అశోక్‌ను కోరారు. ఈ మేరకు వినతి పత్రం అందించారు. గతంలో ఏడాది పని చేసిన వారికి రెమ్యురేషన్‌లో కోత విధించడం జరిగిందని గుర్తు చేశారు. ఈ ఏడాది ఎలాంటి కోత విధించకుండా చెల్లించాలన్నారు.

● ప్రమాదకర ప్రయాణం



నగరంలోని బైపాస్ రోడ్డు నుంచి కంఠేశ్వర్‌కు వెళ్లే మార్గంలో సోమవారం ఓ బియ్యం లోడ్ లారీ ప్రమాదకరంగా ప్రయాణించింది. లారీలో భారీ ఎత్తున బియ్యం సంచుల లోడ్ ఉండగా, ప్రయాణ సమయంలో సంచులు ఒక పక్కకు రావడంతో ఎక్కడ పడిపోతాయోయని ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. ఈ విషయాన్ని లారీ డ్రైవర్‌కు చెప్పినా పట్టించుకోకుండా వెళ్లాడని కొందరు ప్రయాణికులు పేర్కొన్నారు. ఈ దృశ్యాన్ని 'సాక్షి' క్లిక్ మనిపించింది.

–సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు
- ప్రజావాణికి 70 వినతులు





ప్రజావాణిలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అధికారులు

నిజామాబాద్‌అర్బన్: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 70 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, జెడ్పీ సీఈవో సాయాగౌడ్, డీపీవో శ్రీనివాస్, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్, మెప్మా పీడీ రాజేందర్, నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డిలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

బకాయిలు ఇప్పించండి

గత కొన్ని సంవత్సరాలుగా బెస్ట్ అవైలబుల్ పాఠశాలలకు నిధులు మంజూరు కావడంలేదు. దీంతో విద్యార్థులకు విద్య అందించడం చాలా ఇబ్బందిగా మారింది. కోట్ల రూపాయల బకాయిలు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది. ప్రభుత్వం స్పందించి నిధులు మంజూరు చేయాలి. – జయసింహ గౌడ్, విజ్ఞాన్ హైస్కూల్ కరస్పాండెంట్

పింఛన్ వస్తలేదు..



నాకు 60ఏళ్ల వయస్సు ఉన్నా ఇప్పటికీ పింఛన్ వస్తలేదు. ఎన్నో సార్లు దరఖాస్తు చేసుకున్నా, అధికారులను కలిసి విన్నవించినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి. – రాములు, కలిగోట్

అధికారులు స్పందించాలి



పింఛన్ కోసం గతంలో ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నాను. అధికారులు పరిశీలన చేసి, చెబుతాం అంటున్నారు. నెలలు గడుస్తున్నా నాకు పింఛన్ మాత్రం ఇవ్వడంలేదు. అధికారులు ఇప్పటికైనా స్పందించి పింఛన్ ఇప్పించాలి. – దయానంద్, కలిగోట్

రేషన్ కార్డులో పేరు తొలగించడం లేదు



మా రేషన్ కార్డులో బంధువు పేరును అధికారులు తొలగించడం లేదు. గత కొన్ని రోజులుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. బంధువు పేరు తొలగించి సమస్యను పరిష్కరించాలి. – ఎర్రోల్ల విజయ, గూపన్‌పల్లి

రుణమాఫీ చేయడం లేదు..



ఇప్పటివరకు నాకు రైతు రుణమాఫీ కాలేదు. సమస్యను సంబంధిత అధికారులకు విన్నవించినా పరిష్కారం కావడం లేదు. రెండు లక్షల రూపాయల బకాయి ఉంది. అందరికీ రుణ మాఫీ అయినా నాకు మాత్రం కాలేదు, అధికారులు స్పందించి రుణమాఫీ చేయాలి. – రాములు, ధర్పల్లి

పచ్చిధాన్యం కొనుగోళ్లకు వ్యాపారులు సై

- దొడ్డు రకాలకు రూ.2,200, సన్న రకాలకు రూ.2,300గా ధర నిర్ణయం
- పొలాల వద్దనే తూకం చేస్తున్న వైనం



పాలెం రోడ్డు మార్గంలో పచ్చి ధాన్యాన్ని బస్తాల్లో నింపుతున్న కూలీలు

మోర్తాడ్(బాల్కొండ): పచ్చి ధాన్యంను సైతం కొనుగోలు చేయడానికి వ్యాపారులు ఆసక్తి చూపుతున్నారు. పచ్చి ధాన్యంను కొనుగోలు చేస్తామని వ్యాపారులు తమ ఏజెంట్ల ద్వారా ప్రచారం చేయిస్తున్నారు. దొడ్డు రకాలైతే రూ.2,200, సన్న రకాలైతే రూ.2,300 ధరను క్వింటాలుకు చెల్లిస్తామని వ్యాపారులు చెబుతున్నారు. పొలాల వద్దకే పచ్చి ధాన్యం తూకాలు చేస్తున్నారు.

ప్రభుత్వం సన్నాలకు బోనస్ ప్రకటించడంతో..

యాసంగి సీజనులోని సన్న రకాలకు బోనస్ చెల్లించడానికి ప్రభుత్వం అంగీకరించిన నేపథ్యంలో రైతులు తమ పంటను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించడానికి మొగ్గుచూపుతున్నారు. దీంతో దళారులు, వ్యాపారులు తమ వ్యాపారం కోసం వరి ధాన్యంను సేకరించుకోవడానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసే వరి ధాన్యంకు తేమ శాతం 17కు మించి ఉండకూడదనే నిబంధన ఉంది. తేమ శాతం తక్కువగా ఉండాలంటే ధాన్యంను ఎండబెట్టాల్సి ఉంటుంది. వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటే చేతికి వచ్చిన ధాన్యం నీటిపాలై నష్టపోతామని కొందరు రైతులు భావిస్తున్నారు. దీంతో పలువురు రైతులు పొలాల వద్దనే పచ్చి ధాన్యంను వ్యాపారులకు విక్రయిస్తున్నారు. రైతుల నుంచి పచ్చి ధాన్యంను సేకరిస్తే తూకం వేసిన ధాన్యానికి సొమ్మును 15 రోజుల నుంచి 25 రోజుల గడువులోగా చెల్లించడానికి వ్యాపారులు అంగీకరిస్తున్నారు.

జిల్లాలో సన్న రకాలే ఎక్కువ..

యాసంగి సీజనులోనూ సన్న రకాలకు బోనస్ చెల్లిస్తామని ప్రభుత్వం వెల్లడించడంతో జిల్లాలో 80 శాతం సన్న రకాలే సాగు చేశారు. దొడ్డు రకాలు కేవలం 20 శాతం మాత్రమే ఉంది. విదేశాలకు బాయిల్డ్ బియ్యంను ఎగుమతి చేసే వ్యాపారులు తమ వ్యాపారం కోసం పచ్చి ధాన్యంను కొనుగోలు చేయాలని నిర్ణయించారు. కొనుగోలు కేంద్రాల నుంచి సేకరించే ధాన్యం మిల్లర్ల వద్దకు చేరాలంటే ఎక్కువ సమయం పడుతుంది. పచ్చి ధాన్యంను కొనుగోలు చేస్తే వెంటవెంటనే బాయిల్డ్ మిల్లులకు తరలించుకోవచ్చని వ్యాపారులు భావిస్తున్నారు.

కల్తీ కల్లుతో పలువురికి అస్వస్థత

- చికిత్స నిమిత్తం బాన్సువాడ, నిజామాబాద్ ఆస్పత్రులకు తరలింపు
- దుర్కి కల్లు డిపో పరిధిలో ఘటన



బాన్సువాడ ఆస్పత్రిలో కల్తీకల్లు బాధితులను పరామర్శిస్తున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

బాన్సువాడ/నస్రుల్లాబాద్: కల్తీ కల్లు తాగి పలువురు అస్వస్థతకు గురయ్యారు. ఎనిమిది మంది పరిస్థితి విషమంగా ఉండడంతో నిజామాబాద్ జీజీహెచ్‌కు తరలించారు. వివరాలిలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా నస్రుల్లాబాద్ మండలంలోని దుర్కి కల్లు డిపోనుంచి పలు గ్రామాలకు కల్లు సరఫరా అవుతుంది. సోమవారం ఈ కల్లు తాగిన అంకోల్, దుర్కి, దామరంచ గ్రామవాసులు అస్వస్థతకు గురయ్యారు. కల్లు తాగిన తర్వాత కళ్లు తేలేయడం, మెడలు వెనక్కి పడేయడం చేస్తుండడంతో వారిని కుటుంబ సభ్యులు బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. క్రమంగా బాధితులు పెరుగుతుండడంతో డిప్యూటీ డీఎంహెచ్‌వో విద్య అంకోల్ గ్రామానికి వెళ్లి వైద్య సిబ్బందికి సూచనలు ఇచ్చారు. కల్తీ కల్లు బాధితులను వెంటనే ఆస్పత్రికి పంపించాలని ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలకు సూచించారు. ఆరోగ్య సిబ్బంది స్థానిక గ్రామ పంచాయతీ వద్ద మందులను అందుబాటులో ఉంచారు. బాధితులకు ప్రథమ చికిత్స అందించిన తర్వాత అంబులెన్సులో బాన్సువాడకు పంపిస్తున్నారు. కాగా సోమవారం రాత్రి వరకు 60 మంది కల్తీ కల్లు బాధితులు బాన్సువాడ ఆస్పత్రిలో చేరారు. మెరుగైన వైద్యం కోసం 12 మందిని నిజామాబాద్ జీజీహెచ్‌కు రిఫర్ చేశారు. పనులకు వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చినవారు కల్లు తాగుతారు. ఈ నేపథ్యంలో బాధితుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశాలున్నాయని భావిస్తున్నారు.

డిపోలోని కల్లును పరీక్షించామని, అందులో సీహెచ్ శాతం లేదని బాన్సువాడ ఎక్సైజ్ సీఐ యాదిరెడ్డి తెలిపారు. ఇంకా ఏదైనా మత్తు పదార్థం ఉందేమో తెల్చడానికి శాంపిల్స్ సేకరిస్తున్నామని పేర్కొన్నారు. బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి ఆస్పత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ కల్తీ కల్లు అమ్మి అమయాకుల ప్రాణాలతో చెలగాటమడుతున్న కల్లు దుకాణం నిర్వాహకుల లైసెన్స్ రద్దు చేయాలని ఆదేశించారు.

ఎస్బీ పోలీసులకు స్టేషన్ల కేటాయింపు

ఖలీల్‌వాడి: నిజామాబాద్ స్పెషల్ బ్రాంచ్ పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న ఏఎస్సైలు, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లకు పోలీస్‌స్టేషన్లు కేటాయించారు. సీపీ పోతరాజు సాయిచైతన్య ఆదేశాల మేరకు అధికారులు పీఎస్‌లలో మార్పులు చేపట్టారు. నగరంలోని ఒకటి, రెండవ పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న లింగారావును నాలుగవటౌన్ పోలీస్‌స్టేషన్‌కు, నాలుగు, ఐదవ పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న ముత్తెన్నను ఒకటవ టౌన్ పీఎస్‌కు, మూడవ, ఆరవ టౌన్‌లో పని చేస్తున్న గంగాధర్‌గౌడ్‌ను ఆరవటౌన్ పీఎస్‌కు, నిజామాబాద్ రూరల్, మోపాల్‌లో పని చేస్తున్న సాయిలును నందిపేట్, ఆలూర్ పీఎస్‌కు, డిచ్‌పల్లిలో ఉన్న సురేందర్‌రెడ్డిని డిచ్‌పల్లి, మోపాల్, ఇందల్వాయి పీఎస్‌లను కేటాయించారు. ధర్పల్లి, సిరికొండ పీఎస్‌లను వసంత్‌ను కేటాయించారు. భీమ్‌గల్ సర్కిల్ పని చేస్తున్న రమేష్‌ను కమ్మర్‌పల్లి, ఏర్గట్ల, భీంగల్ పీఎస్‌కు, మోర్తాడ్ ఏర్గట్లలో పని చేస్తున్న మనోజ్‌ను ముప్కాల్, మెండోరా, మోర్తాడ్ పీఎస్‌కు, ఆర్మూర్ సర్కిల్ పరిధిలో పని చేస్తున్న రతన్‌సింగ్‌ను బాల్కొండ, జక్రాన్‌పల్లి, వేల్పూర్ పీఎస్‌కు, ఆర్మూర్‌లో పని చేస్తున్న అన్వర్‌ను నగరంలోని రెండో టౌన్, ఐదోటౌన్ పీఎస్‌కు, మాక్లూర్, నందిపేట్ పీఎస్‌లో ఉన్న శ్రీనివాస్‌రెడ్డిని నిజామాబాద్ రూరల్, నగరంలోని మూడోటౌన్ పీఎస్‌కు, నవీపేట్, రెంజల్, ఎడపల్లి పీఎస్‌లో పని చేస్తున్న కాశీనాథ్‌ను రుద్రూర్ సర్కిల్‌కు కేటాయించారు. రుద్రూర్ సర్కిల్ ఉన్న శ్రీనివాస్‌ను రెంజల్, ఎడపల్లి పీఎస్‌కు ఇచ్చారు. ఎస్బీలో కొంతకాలంగా వేకెంట్‌లో ఉన్న రాజేశ్వర్‌ను నవీపేట్, మాక్లూర్ పీఎస్‌కు, గోపిని ఆర్మూర్ రూరల్, ఆర్మూర్ టౌన్‌కు కేటాయించారు. ప్రస్తుతం ఎస్బీ సిబ్బంది జగదీష్ కొన్ని రోజుల నుంచి సెలవులో ఉన్నారు. తిరిగి జగదీష్ డ్యూటీలోకి వస్తే ఇతనికి కూడా పీఎస్ కేటాయించే అవకాశం ఉంది. నగరంలో ఎక్కువగా కార్యక్రమాలు, క్రైమ్స్ ఉండటంతో ఎస్బీ సిబ్బంది పీఎస్‌లను కుదించినట్లు తెలుస్తోంది.

నల్లమడుగులో క్షుద్ర పూజల కలకలం



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని నల్లమడుగు ఉన్నత పాఠశాలలో క్షుద్రపూజల కలకలం రేపింది. పాఠశాలకు శని, ఆదివారాలు సెలవులు రావడంతో గుర్తుతెలియని వ్యక్తులు పాఠశాలలోని ఓ గది వద్ద ముగ్గు వేసి పసుపు, కుంకుమ, అరటిపండ్లు, నిమ్మకాయలతో పట్టు వేసినట్లు బొమ్మలను వేశారు. సోమవారం ఉదయం పాఠశాలకు వచ్చిన విద్యార్థులు ఈ దృశ్యాన్ని చూసి భయాందోళనకు గురయ్యారు. ఈ విషయం గ్రామంలో తెలియడంతో చర్చనీయాంశంగా మారింది. గ్రామస్తులు, కార్యదర్శి, మాజీ సర్పంచ్, గ్రామ పెద్దలతో చర్చించి లింగంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు హెచ్‌ఎం కోటేశ్వర్‌రావు తెలిపారు.

రెండు స్కూల్ బస్సులు ఢీ: తప్పిన పెను ప్రమాదం



మోపాల్: మండలంలోని కులాస్‌పూర్ తండా శివారులో సోమవారం ఉదయం రెండు స్కూల్ బస్సులు ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాయి. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. కంజర్ గ్రామంలోని శ్రీసాయి విద్యానికేతన్ బస్సు, డిచ్‌పల్లి మండలంలోని వివేకానంద స్కూల్ బస్సు సోమవారం పిల్లలను తీసుకొచ్చేందుకు వెళ్లగా, కులాస్‌పూర్ తండా వద్ద ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాయి. స్వల్ప ప్రమాదం చోటుచేసుకుందని, బస్సులో పిల్లలకు ఎలాంటి ప్రమాదం జరగలేదని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. రోడ్డుపై ధాన్యం ఆరబెట్టడంతో రోడ్డు ఇరుకుగా మారడంతో ప్రమాదం జరిగినట్లు స్థానికులు పేర్కొన్నారు. ఇదేవిషయమై ఎస్ఐ యాదగిరి గౌడ్‌ను వివరణ కోరగా, ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని కాటేపల్లి గ్రామ శివారు మీదుగా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై మహేందర్ సోమవారం తెలిపారు. కేసు నమోదు చేసి, ట్రాక్టర్లను తహసీల్దార్ దశరథ్‌కు అప్పగించినట్లు పేర్కొన్నారు.

హాస్టల్ నుంచి ఇద్దరు విద్యార్థుల మిస్సింగ్

బాన్సువాడ: బీర్కూర్‌లోని మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాల– హాస్టల్ నుంచి 8వ తరగతి చదివే ఇద్దరు విద్యార్థులు మిస్సింగ్ అయినట్లు ప్రిన్సిపాల్ శివకుమార్ తెలిపారు. ఈమేరకు అతడు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తోటి స్నేహితులను విచారించగా సదరు విద్యార్థులు కిష్టాపూర్‌లో యూనిఫామ్ మార్చుకుని గౌరారం గ్రామంలోని తోటి స్నేహితుడి దగ్గరకు వెళ్లినట్లు తెలిపారు. ఆ గ్రామం పరిసర ప్రాంతంలో వెతుకగా వారి ఆచూకీ దొరకలేదన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

క్రైం కార్నర్

చేపలవేటకు వెళ్లి ఒకరి మృతి

ఎడపల్లి(బోధన్): చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి వలకు చిక్కుకొని, నీటమునిగి మృతి చెందాడు. ఎస్సై వంశీచందర్‌రెడ్డి సోమవారం తెలిపారు. వివరాలు ఇలా.. ఎడపల్లి మండలంలోని జాన్కంపేట్‌కు చెందిన శ్రీనివాస్ (28) బోర్‌బండి డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ములుగు జిల్లా నుంచి ఇక్కడకు వచ్చి 18ఏళ్లుగా ఇక్కడే నివాసం ఉంటున్నాడు. పనిలేనప్పుడు చేపలు పట్టడానికి వెళుతుండేవాడు. ఈక్రమంలో ఆదివారం ఉదయం చేపల వేటకని స్థానిక చెరువు వద్దకు వెళ్లాడు. చేపలు పట్టేందుకు వల వేయగా, అదే వలకు చిక్కుకొని నీటమునిగి మృతిచెందాడు. మృతుడి భార్య వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

స్నానానికి వెళ్లి చెరువులో పడి ఒకరు..



బాల్కొండ: ముప్కాల్ మండలం కొత్తపల్లి గ్రామంలో ఓ యువకుడు స్నానం చేయడానికి చెరువుకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన చింతకాయల చరణ్(18)కు మతిస్థిమితం సరిగా ఉండదు. సోమవారం ఉదయం అతడు స్థానిక ఊర చెరువులో స్నానం చేయడానికి వెళ్లి, ఇంటికి తిరిగిరాలేదు. దీంతో కుటుంబసభ్యులు చెరువు వద్దకు వెళ్లగా అతడి దుస్తులు ఒడ్డున ఉండటంతో చెరువులో గాలింపు చర్యలు చేపట్టగా మృతదేహం లభ్యమైంది. సమాచారం అందుకున్న ముప్కాల్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

పదేళ్ల క్రితం ఇద్దరు కుమారులు..

కొత్తపల్లి గ్రామానికి చెందిన చింతకాయల రవి, రజిత దంపతులకు మొత్తం నలుగురు కుమారులు. వారిలో ఇద్దరు కుమారులు గత పదేళ్ల క్రితం ఊర చెరువు నుంచి ప్రవహించే కాలువలో పడి మృతి చెందారు. పెద్ద కుమారుడైన చరణ్ చెరువులో పడి మృతిచెందాడు. దీంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం అలుముకుంది.

నగరంలో గంజాయి విక్రేతల అరెస్టు

ఖలీల్‌వాడి: నగరంలో గంజాయి అమ్ముతున్న బీహారీ యువకుడిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించిన్నట్లు మూడో టౌన్ ఎస్సై హరిబాబు సోమవారం తెలిపారు. వివరాలు ఇలా.. నగరంలోని దుబ్బ, గుర్బబాది రోడ్డు, కృష్ణమందిర్ దగ్గరలో గంజాయి అమ్ముతున్నారనే సమాచారం రావడంతో పోలీసులు ఘటనస్థలానికి చేరుకున్నారు. అక్కడ గంజాయి అమ్ముతున్న పునీత్ కుమార్ (25) అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. బీహార్‌లోని ఖగారియా మండలంలోని బదాస్‌నార్త్ గ్రామానికి చెందిన పునీత్‌కుమార్ గంజాయి తీసుకువచ్చి అమ్మినట్లు తెలిపారు. నిందితుడి నుంచి 55గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

నిజాంకాలనీలో..

నగరంలోని బైపాస్‌రోడ్డులోని నిజాంకాలనీలో గంజాయి అమ్ముతున్న షేక్ ముజీబ్‌ను అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వెంకటేష్ తెలిపారు. షేక్‌ముజీబ్ నుంచి బైక్, సెల్‌ఫోన్, 250 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ దాడిలో ఎక్సైజ్ హెచ్‌సీ భూమన్న, కానిస్టేబుళ్లు అవినాష్, విష్ణు, శ్యామ్, బోజన్న, గంగారాంలు పాల్గొన్నారు.

పేకాడుతున్న తొమ్మిది మంది..

డిచ్‌పల్లి: మండలంలోని అమృతాపూర్ గ్రామ శివారులో పేకాట ఆడుతున్న 9మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై ఎండీ షరీఫ్ సోమవారం తెలిపారు. వివరాలు ఇలా.. ఆదివారం రాత్రి విశ్వసనీయ సమాచారం మేరకు పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న సిరికొండ రాజేశ్వర్, బాల్‌రాజ్ గౌడ్, రాములు, ఎం.బాల్‌రాజ్, మురళి, ప్రవీణ్, గాంధారి బాబు, పీ బాబు, మనోహర్‌లను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.2,330 నగదు, 8 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పేకాటరాయుళ్ల వద్ద పోలీసులు రూ.15వేల నగదు స్వాధీనం చేసుకొని, రూ.2,330లు మాత్రమే స్వాధీనం చేసుకున్నట్లు చూపారని స్థానికంగా చర్చించుకోవడం గమనార్హం.

మహిళపై వ్యక్తి దాడి

- తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి
- కొడుకును కిడ్నాప్ చేసిందనే అనుమానంతో ఘాతుకానికి పాల్పడిన నిందితుడు
- చందానాయక్ తండాలో ఘటన



వివరాలు సేకరిస్తున్న సదాశివనగర్ సీఐ సంతోష్ కుమార్, ఎస్సై ఆంజనేయులు

గాంధారి(ఎల్లారెడ్డి): తన కొడుకును కిడ్నాప్ చేసి, దాచిందనే అనుమానంతో ఓ మహిళపై నిందితుడు దాడి చేయగా, తీవ్ర గాయాలతో ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాలు ఇలా.. చందానాయక్ తండాకు చెందిన కేతావత్ పిరాజీ గత కొన్నేళ్లుగా హైదరాబాద్ బేగంపేట్‌లో ఉంటూ భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అదే ప్రాంతంలో అమీనా బేగం (35) కూడా భిక్షాటన చేస్తూ జీవనం సాగించేది. పిరాజీ కుమారుడు నాలుగేళ్ల వయస్సుగల శ్రీకాంత్ కొన్ని రోజులుగా కనిపించకుండా పోయాడు. అమీనా బేగం తన కుమారుడిని కిడ్నాప్ చేసి దాచిందనే అనుమానంతో పిరాజీ ఆమెను ఇటీవల చందానాయక్ తండాకు తీసుకొచ్చాడు. ఆమెను తన కొడుకును ఎక్కడ దాచావో చెప్పాలని ప్రశ్నించాడు. ఆమె వివరాలు చెప్పలేదు. ఈక్రమంలో తండా సమీపంలోని మేడిపల్లి అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి విచక్షణా రహితంగా కర్రలతో కొట్టాడు. అనంతరం అక్కడి నుంచి అతడు వెళ్లిపోయాడు. ఆమెకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు గమనించి గాంధారి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆమె సోమవారం మృతి చెందింది. మేడిపల్లి మాజీ సర్పంచ్ నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సదాశివనగర్ సీఐ సంతోష్ కుమార్ విచారణ చేస్తున్నారని ఎస్సై తెలిపారు.

కామారెడ్డిలో ఒకరి ఆత్మహత్య



బోదాసు రాజు (ఫైల్)

కామారెడ్డి క్రైం: జిల్లాకేంద్రంలోని ఇందిరానగర్ కాలనీలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. కాలనీకి చెందిన బోదాసు రాజు (35) కూలీ పని చేసుకుంటూ జీవించేవాడు. అతడికి లక్ష్మితో 13 ఏళ్ల క్రితం వివాహం జరుగగా, ఇద్దరు సంతానం ఉన్నారు. దంపతుల మధ్య గొడవలు జరుగడంతో లక్ష్మి కొద్దిరోజులుగా తన తల్లిగారింటి వద్దనే ఉంటోంది. దీంతో రాజు మద్యానికి బానిసై, భార్య కాపురానికి రావడం లేదని మనస్థాపం చెందేవాడు. ఈక్రమంలో ఆదివారం అర్ధరాత్రి అతడు ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం ఉదయం కుటుంబ సభ్యులు అతడిని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి అన్న యాదగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి..

కామారెడ్డి క్రైం: రైలు కింద పడి ఓ గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన వడియారం–మిర్జాపల్లి రైల్వే స్టేషన్‌ల మధ్య ప్రాంతంలో సోమవారం ఉదయం వెలుగుచూసింది. పట్టాలపై మృతదేహం పడి ఉందని సమాచారం రావడంతో కామారెడ్డి రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ జరిపారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతుడి ఎడమ చేతికి వెండి కడియం, ఛాతిపై కుడి వైపున పుట్టు మచ్చ ఉన్నాయని రైల్వే పోలీసులు తెలిపారు. ఆనవాళ్లు తెలిసిన వారు కామారెడ్డి రైల్వే పోలీసులను సంప్రదించాలని, కేసు విచారణ అధికారి హన్మాండ్లు కోరారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఒకరికి జైలు

ఇందల్వాయి: డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఇటీవల పట్టుబడ్డ ఓ వ్యక్తికి కోర్టు జైలు శిక్ష విధించినట్లు ఎస్సై మనోజ్ తెలిపారు. ఇందల్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలో గతవారం నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీల్లో వెంగల్‌పాడ్ గ్రామానికి చెందిన లావుడ్య రాజు మద్యం తాగి వాహనం నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డాడు. పోలీసులు అతడిని సోమవారం కోర్టులో హాజరుపర్చగా జడ్జి మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై తెలిపారు.

రుద్రూర్ మండలంలో..

రుద్రూర్: డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఒకరికి బోధన్ కోర్టు జైలు శిక్ష విధించినట్లు ఎస్సై సాయన్న తెలిపారు. పోలీసులు ఇటీవల డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు చేపట్టగా మండలంలోని సులేమాన్ నగర్ గ్రామానికి చెందిన సతీష్‌గౌడ్ మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. అతడిని పోలీసులు సోమవారం బోధన్ కోర్టులో హాజరుపర్చగా జడ్జి రెండు రోజుల జైలుశిక్ష విధించినట్లు తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని తెలిపారు.

నవీపేట మండలంలో..

నవీపేట: మండలంలోని అబ్బాపూర్(ఎం) గ్రామంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై వినయ్ తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన బట్టు నరేష్(32) గ్రామపంచాయతీలో వాటర్‌మెన్‌గా విధులు నిర్వహించేవాడు. నరేష్ అవసరం నిమిత్తం తన తండ్రికి రూ. 500లు ఇవ్వమని అడిగాడు. కానీ తండ్రి డబ్బులు ఇవ్వడానికి నిరాకరించడంతో తీవ్ర మనస్థాపానికి గురైన నరేష్ సోమవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య గౌతమి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆకట్టుకున్న ఆర్మీ పారా గ్లైడింగ్



విన్యాసకులతో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్..



పారాగ్లైడింగ్ విన్యాసాలు

నిజామాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో సోమవారం సాయంత్రం ఆర్మీ అధికారుల నేతృత్వంలో నిర్వహించిన పారా గ్లైడింగ్ విన్యాసాలు ఆకట్టుకున్నాయి. 250వ ఏవోసీ కార్ప్స్ డేను పురస్కరించుకుని సికింద్రాబాద్ ఆర్మీ కంటోన్మెంట్ ఆధ్వర్యంలో పారా మోటార్ ఎక్స్‌పెడిషన్– 2025 యాత్ర చేపట్టారు. ఢిల్లీ నుంచి ప్రారంభమైన ఈ యాత్ర ఆగ్రా, కాన్పూర్, ఝాన్సీ, సాగర్, జబల్‌పూర్, పుల్గాం మీదుగా సోమవారం సాయంత్రం నిజామాబాద్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా వారికి అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, ఇతర అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆర్మీ కంటోన్మెంట్ లెఫ్టినెంట్ కల్నల్ అమత్ నేతృత్వంలో నిర్వహించిన పారా గ్లైడింగ్ విన్యాసాలు అలరించాయి. ఎన్‌సీసీ కెడెట్లు, యువతీయువకులకు పారా గ్లైడింగ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఎస్‌వో అరవింద్ రెడ్డి, సివిల్ సప్లై డీఎం శ్రీకాంత్ రెడ్డి, పోలీసు, ఎన్‌సీసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.